క్లుప్తంగా

పశువులను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



ఏటూరునాగారం : ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం జాతీయ రహదారిపై పోలీస్ సిబ్బందితో సోదాలు చేస్తుండగా టీఎస్29టీఏ 4895 గల ఓ లారీలో నాలుగు ఎద్దులు, రెండు లేగ దూడలు తరలిస్తున్నారన్నారు. డ్రైవర్ కరీముల్లా, వాహన యజమాని మండవ నరేష్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కాగా వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి పశువులను రాంపూర్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో నీటిని తోడేస్తున్నారు



వాజేడు : మండల పరిధిలోని ఐటీఐ కళాశాల పక్కనే ఉన్న చెరువులోని నీటిని తోడేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులో మరమ్మతులు చేసేందుకు నీరుఉండటంతో అందులోని నీటిని తోడుతున్నారు. వేసవి దృష్ట్యా ఎండలు అధికంగా ఉన్న క్రమంలో మూగజీవాలు తాగేందుకు చెరువులో నీరు ఉపయోగపడుతుంది. కానీ చెరువులో నీరు తోడి బయట పోస్తే మళ్లీ వర్షం కురిసే వరకు చెరువు ఎండిపోయి ఉంటుంది. మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు చెరువులోని నీటిని తోడవద్దని స్థానికులు కోరుతున్నారు.

'ఆదివాసీలను మోసం చేస్తున్న పార్టీలు'

మంగపేట : ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలను ప్రధాన రాజకీయ పార్టీలు వారి రాజకీయ స్వప్రయోజనాల కోసం అన్ని విధాలుగా మోసం చేస్తున్నాయని మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని రాజుపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు 4 లక్షల పైచిలుకు జనాభా ఉన్న ఆదివాసీలకు ఎంపీ టికెట్ కేటాయించకుండా లంబాడీ సామాజిక వర్గానికి ఎంపీ టికెట్ కేటాయించిందన్నారు. ఆదివాసీ హక్కుల పోరాటంలో ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న దళిత బహుజన వర్గాలు, సామాజిక కులాలు మానవతావాదులు ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాల పట్ల ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నల్లబెల్లి : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నర్సంపేట రూరల్ సీఐ రాజగోపాల్ కోరారు. మండలంలోని నారక్కపేట, గుండ్లపహాడ్, రుద్రగూడెం, రంగాపురం, రేలకుంట, నందిగామ, లెంకాలపల్లి, నల్లబెల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఎస్సై రామారావుతో కలిసి సోమవారం సీఐ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన భద్రతా చర్యలపై ఎస్సైతో చర్చించారు. ఆయా గ్రామాల్లో యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా ఓటేయాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'మంద కృష్ణను విమర్శించే హక్కు శ్రీహరికి లేదు'

నల్లబెల్లి : ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను విమర్శించే నైతిక హక్కు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కోర్నెల్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతి ప్రయోజనాల కోసం త్యాగం చేసిన చరిత్ర మంద కృష్ణకు ఉండగా రాజకీయ స్వార్థం కోసం మాదిగలను అణచివేసిన చరిత్ర కడియం శ్రీహరిదని మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి గెలవాలని సవాలు విసిరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



రేగొండ: చెన్నాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఐ మల్లేషయాదవ్, పోలీసులు

రేగొండ: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ అన్నారు. సోమవారం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని రూపిరెడ్డిపల్లి, చెన్నాపూర్, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి, కొత్తపల్లిగోరి గ్రామాలలో ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రజలందరు సహకరించాలని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ఏమైనా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు దృష్టికి వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిరంతరం గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిత్యం పర్యవేక్షిస్తాయని, పోలీస్ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తారని, అక్రమంగా మద్యం నిల్వలు కలిగి ఉన్నా, రూ.50 వేలకు పైగా నగదుతో పట్టుబడినట్టయితే స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్సై శ్రీలత, సీఆర్పీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

టేకుమట్ల: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఏఎస్సై అమరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదేశాల మేరకు టేకుమట్ల–గర్మిళ్లపల్లి ప్రధాన రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన పత్రాలను తనిఖీ చేశారు. అలాగే బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారులను పరీక్షించి పలువురికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంది కావున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలన్నారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50వేల నగదు కంటే ఎక్కువ నగదును తీసుకెళ్తే ఆధారాలు ఉండాలని లేని పక్షంలో సీజ్ చేస్తామన్నారు. మద్యం అక్రమ రవాణా సరి కాదని అలా అక్రమంగా మద్యన్ని తరలిస్తే కేసుల నమోదు చేస్తామన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, తప్పని సరిగా వాహన పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ మహేందర్, రాజేందర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు రమణ, రమేష్ ఉన్నారు.



టేకుమట్ల: కారును తనిఖీ చేస్తున్న ఏఎస్సై అమరేందర్‌రెడ్డి

'ఆకునల్లి'పై జాగ్రత్తగా ఉండాలి



రైతులకు సలహాలు అందజేస్తున్న ఏఓ రామకృష్ణ

కాటారం: వరి పంటలో ప్రస్తుతం సంభవించే ఆకునల్లి లేదా కంకినల్లిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి గిరి రామకృష్ణ అన్నారు. మండలంలోని విలాసాగర్, గంగారం గ్రామాల్లోని వరి సాగును ఏఓ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరి పంటలో ఆకునల్లి, కంకినల్లి లక్షణాలను గమనించి నివారణ కోసం పలు సూచనలు, సలహాలు చేశారు. ఆకునల్లి సోకితే ఆకుల అడుగు భాగాన చిన్న పురుగులు తెలుపు లేదా బూడిద రంగులో ఉండి గుంపులు గుంపులుగా చేరి రసం పీల్చుతాయని వీటి వలన ఆకులపై భాగంలో తెలుపు లేదా గోధుమ రంగులో నీలపు చారలు ఏర్పడటం జరుగుతుందన్నారు. ఇది వ్యాపించి ఆకు ఎండిపోతాయని తెలిపారు. కంకినల్లి ఆశించినపుడు ఈ చిన్న పురుగులు కంటికి కనిపించనంత చిన్నగా ఉంటాయని ఇది ఆశించినపుడు వరి పొట్టలపై ఉదారంగు చారలు ఏర్పడటంతో పాటు పొట్ట నుంచి గొలుసు పూర్తిగా బయటకు రాదని తెలిపారు. గింజలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కృషించుకు పోతాయని ఏఓ వివరించారు. దీని నివారణ కోసం డైకోఫాల్ ఒక లీటర్ నీటిలో 5 మిల్లీలీటర్లు లేదా ప్రొఫినోఫాస్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి స్పిరోమిస్‌ఫిన్ లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి పంటలో ఏదైన సందేహాలు ఉంటే రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని ఏఓ కోరారు.

అడవిలో మంటలు



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

మహాముత్తారం: మండలంలోని నిమ్మగూడెం యామన్‌పల్లి ప్రధాన రహదారిలోని అడవిలో రెండు రోజుల నుంచి మంటలు చెలరేగుతున్నాయి. గ్రామ సమీపానికి మంటలు రావడంతో సోమవారం యామన్‌పల్లి పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా నీటిని తరలించి మంటలను ఆర్పివేశారు. దీంతో గ్రామస్తులు, వాహనదారులు పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు విద్యను దూరం చేసే కుట్ర



మాట్లాడుతున్న అనిల్ కుమార్

భూపాలపల్లి రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో ఉన్నత విద్యకు అట్టడుగు పేదలను, దళితులను దూరం చేసే కుట్రకు ఒడిగట్టిందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రవి నారాయణరెడ్డి భవన్‌లో పీక రవికాంత్ అధ్యక్షతన డీహెచ్‌పీఎస్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నదన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఉండవని తెలిపారు. రిజర్వేషన్లు కోల్పోతే సామాజిక న్యాయముండదన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంలో రిజర్వేషన్లు ఉండవని మేనేజ్‌మెంట్ కోటాలోనే ప్రతిఒక్కరూ చేరాల్సిందే అని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, నాయకులు రాసపల్లి భద్రయ్య, నేరెళ్ల జోసఫ్, మరాటి కాంతారావు, పొన్నగంటి లావణ్య, దొంతుల రవీందర్, సకినాల మౌనిక, గాజుల మహేష్, గోనెల తిరుపతి, లావణ్య శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



కాసీంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



రేగొండలో..



మొగుళ్లపల్లి: ఇంటింటా ప్రచారంలో సత్యపాల్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య సూచించారు. బీజేపీ ఇంటింటా ప్రచారంలో భాగంగా సోమవారం పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాసీంపల్లి, సెగ్గంపల్లి జంగేడు పకీరుగడ్డ కాలనీలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెన్నంపల్లి పాపన్న పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలందరికీ సంక్షేమ పథకాలందాలంటే నరేంద్ర మోదీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. బీజేపీ వరంగల్ పార్లమెంటు అభ్యర్థి అరూరి రమేష్ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు వేషాల సత్యవతి, అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రామ్‌రెడ్డి, నాయకులు జోరు కృష్ణ, శ్రీకాంత్, రాజు, అనిల్, గుణ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

రేగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి రాజమౌళి గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో పలు బూత్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి గౌడ్ మాట్లాడుతూ కుల, మతాల భేదం లేకుండా ప్రజలు మోదీని మూడవసారి ప్రధానిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మోదీ పాలనలోనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మెతుకుపల్లి బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పెండల రాజు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి తూర్పాటి మల్లేష్, నాయకులు కొడగాని రాకేష్, ఎర్రబాటి శివక్రిష్ణ, గన్‌రెడ్డి లింగారెడ్డి, వరప్రసాద్, మండల రఘు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను అధిక మోజారిటీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సత్యపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మొగుళ్లపల్లి, ఇస్సిపేట, మొట్లుపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టినా సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెవ్వ శేషగిరి జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



సమావేశం అనంతరం డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు

హై కోర్టు ఆదేశాలతో తేలని ఫలితం

కాటారం: కాటారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ చల్ల నారాయణరెడ్డిపై పాలకవర్గ సభ్యులు పెట్టిన అవిశ్వాస సమావేశం సోమవారం నిర్వహించారు. పలు పరిణామాల మధ్య అవిశ్వాస సమావేశం వాయిదా పడుతూ రాగా హై కోర్టు ఆదేశాలతో జిల్లా సహకార అధికారిణి శైలజ అవిశ్వాస సమావేశం నిర్వహించారు. కొన్ని రోజులుగా క్యాంపులో ఉన్న డైరెక్టర్లు ఉదయం 10.30 గంటల ప్రాంతంలో అవిశ్వాస సమావేశానికి చేరుకున్నారు. అనంతరం సుమారు 3 గంటల పాటు డైరెక్టర్లతో డీసీఓ సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం అవిశ్వాసం ప్రక్రియ కొనసాగించారు. డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన ఓటింగ్‌లో పాల్గొనగా హై కోర్టు ఆదేశాల మేరకు డీసీఓ ఓటింగ్ వివరాలు నమోదు చేసుకున్నారు. అవిశ్వాస ఓటింగ్ వివరాలను షీల్డు కవర్ ద్వారా డీసీఓ హై కోర్టుకు సమర్పించనున్నట్లు తెలిపారు. కాగా, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డిపై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై ఆయన గతంలో హై కోర్టును ఆశ్రయించగా తీర్మాన సమావేశంను వాయిదా వేస్తూ కొంత సమయం ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. హై కోర్టు తదుపరి తీర్పుతో సోమవారం సమావేశం నిర్వహించి ఫలితాలను కోర్టుకు అందజేయనున్నారు. ఇది ఇలా ఉండగా పీఏసీఎస్‌కు 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులైన 11 మంది డైరెక్టర్లు హాజరై ప్రస్తుత చైర్మన్‌కు వ్యతిరేకంగా చేతులెత్తే విధానం ద్వారా ఓటు వేసినట్లు తెలిసింది. దీంతో ప్రస్తుత చైర్మన్ చల్ల నారాయణరెడ్డిపై అవిశ్వాసం నెగ్గి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామిపై అవిశ్వాసం వీగే అవకాశాలు ఉన్నాయి. అవిశ్వాస సమావేశం సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని కాళేశ్వరం బార్డర్ చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. సరిహద్దు రాష్ట్రాల గుండా కాళేశ్వరంలో మీదుగా వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు, సోదాలు చేశారు. అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేశారు. వారి వెంట సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న సభ్యులు

రేగొండ: మండలంలోని రావులపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో పున్నం ప్రణీత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రణీత్ కుటుంబ సభ్యులకు ఆస్పత్రి ఖర్చులు భారంగా మారాయి. దీంతో రేగొండ గ్రామానికి చెందిన ఎక్సెల్ అసోసియేషన్ సభ్యులు వెల్దండ రమేష్, కటంగూరి రాజేష్‌రెడ్డి, పోరెడ్డి మధుకర్‌రెడ్డి వారి మిత్రబృందం నుంచి విరాళాలు సేకరించి తమ వంతు సాయంగా రూ.2.10 లక్షలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఎక్సెల్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండాల శంకర్, నాయకులు కట్టంగూరి మనోహర్‌రెడ్డి, మేకల భిక్షపతి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



స్టిక్కర్లు వేయిస్తున్న ఎస్సై శాఖాన్

చిట్యాల: రోడ్డు ప్రమాదాల నివారణకు పలు చర్యలు చేపడుతున్నట్లు సెకండ్ ఎస్సై ఎండి.శాఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని 30 ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు వాహనాలకు రేడియం స్టిక్కర్లు వేయించినట్లు తెలిపారు. అనంతరం డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాదారుడు నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని కోరారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది మధుసూదన్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

శాయంపేట : పట్టణంలోని కుందూరుపల్లి ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశానికి వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, వరంగల్ పార్లమెంట్ ఎన్నిల ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అర్చకులు, స్థానికులు

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం గ్రామంలో రాజరాజేశ్వర ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ జాడి రామరాజు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అంతకు ముందు హోమం నిర్వహించగా పలువురు దంపతులు పూజలో పాల్గొన్నారు. జేఎల్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేస్తున్నట్లు చైర్మన్ రామరాజు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా భక్తులను కోరారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పల్ల బుచ్చయ్య, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం సమ్మక్క, కుమ్మరి సత్యం, కావిరి నాగేష్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'బలరాంనాయక్‌ను గెలిపించాలి'

ఏటూరునాగారం : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మానుకోట అభ్యర్థి బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పార్లమెంటు నియోజకవర్గ మండల ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్క, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్నల సూచనల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన పార్టీ ఇన్‌చార్జ్‌లను వారు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుడ్ల దేవేందర్, ఎండీ అయూబ్‌ఖాన్, గుమ్మడి సోమయ్య, పీఏసీఎస్ చైర్మన్ బాలరాజు, రియాజ్, ఎండీ ఖలీల్‌ఖాన్, ముక్కెర లాలయ్య, వి.నర్సింహరావు, చిన్న ఎల్లయ్య, సరికొప్పుల శ్రీనివాస్, జిల్లా, మండల నాయకులు, మహిళా నాయకులు, యువజన సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న అశోక్

గోవిందరావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూర్ మండల కేంద్రానికి చెందిన బండారి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా రాష్ట్ర మంత్రి సీతక్క వ్యక్తిగత సహాయకుడు బండారి సతీష్ తండ్రి వెంకటేశ్వర్లు దశదిన కర్మకు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాష, మైల జయరాం రెడ్డి, పాలడుగు వెంకటకృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, కణతల నాగేందర్ రావు, ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి, అనిల్ యాదవ్, పెండెం శ్రీకాంత్ పాల్గొన్నారు.